నిబంధనలకు నీళ్లు

- ఓవర్ లోడుతో ఇసుక వాహనాల రాకపోకలు
- పరిమితికి మంగళం పాడిన ఇసుకాసురులు
- ప్రయాణికుల కంటిలో పడుతున్న ఖైనం
- పట్టించుకోని అధికారులు



కాతేరు వద్ద అధిక లోడుతో వెళుతున్న ఇసుక లారీలు

రాజమహేంద్రవరం రూరల్ : ఇసుక అక్రమ తరలింపులో ఎప్పటికప్పుడు సరికొత్త పోకడలకు తెరలేపుతున్న కూటమి నాయకులు ఓవర్ లోడు నిబంధనలనూ గాలికొదిలేశారు. పరిమితికి మించి వాహనాల్లో ఇసుకను లోడు చేసి తరలించుకుపోతున్నారు. ఈ క్రమంలో రోడ్లు ధ్వంసం అయిపోతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడంలేదు. అంతే కాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా అధిక లోడు తరలిస్తున్న ఇసుక ప్రయాణికుల కంటిలో పడుతోంది. భారీ వాహనాల డోర్లు కంటే ఎత్తుగా ఇసుక లోడు చేస్తున్నారు. దీనివల్ల వాహనం వేగానికి వెనుక వచ్చే తీవ్ర ప్రయాణికులకు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై కూడా ఇసుక పడడంతో వాహనాలు గ్రిప్‌ను కోల్పోయి ప్రమాదాల బారిన పడుతున్నాయి. అయినప్పటికీ సంబంధిత మైన్స్, రెవెన్యూ, రవాణాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ర్యాంపులు సమీపంలో ఉండే రోడ్ల వెంబడి ఈ ఇబ్బందులు అధికంగా ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



మోరంపూడి జంక్షన్ వద్ద ఇసుకపై గ్రీన్‌మేట్ లేకుండా ఉన్న లారీ



ఐఎల్‌టీడీ జంక్షన్ వద్ద రోడ్డుపై ఇసుకతో వాహన చోదకుల ఇక్కట్లు

క్లుప్తంగా

ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం



తయారుచేసిన హ్యాండ్ క్రాఫ్టలతో విద్యార్థులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో బుధవారం రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. పుస్తక పఠనం, లైఫ్‌స్కిల్స్, హ్యాండ్ క్రాఫ్ట్, భగవద్గీత, లలిత సంగీతంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్టు లైబ్రేరియన్ శ్రీదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మతల రమేష్, ఆదిరెడ్డి శ్రీనివాసు, సుబ్రహ్మణ్యం, బొడ్డు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ట్రస్టు తరుపున విద్యార్థులకు మజ్జిగ వితరణ చేశారు.

ఏఆర్‌టీ సెంటర్ సిబ్బందితో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న వసుంధర

కంబాలచెరువు: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఉన్న ఏఆర్‌టీ సెంటర్‌లో ఏఆర్‌టీ, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలతో నెలసరి సమన్వయ సమావేశం బుధవారం నిర్వహించారు. దీనికి జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎస్.వసుంధర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుడు క్రమం తప్పకుండా మందులు వాడేలా సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికీ హెపిటైటిస్ బీ, సీ పరీక్షలు, వ్యాక్సిన్ అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.బాలాజీ, వైద్యాధికారులు డాక్టర్ కిరణ్, డాక్టర్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పీజీసెట్ శిక్షణ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఈనెల ఒకటో తేదీ నుంచి రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో ఉచితంగా పీజీ సెట్ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే బుధవారం తెలిపారు. ఈ ఉచిత శిక్షణ తరగతులకు 150 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారన్నారు. ఈ తరగతులకు ప్రారంభోత్సవ కార్యక్రమం కళాశాలలో నిర్వహించామన్నారు. దీనిలో రసాయన శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, పీజీ సెట్ కోచింగ్ సమన్వయకర్త డాక్టర్ ఎం.శాంతకుమారి, ఎస్‌టీసీ సమన్వయ కర్త బి.వెంకట్రావు, తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



ఉపాధి పనులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో రమేష్

కడియం: మురమండలో ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పనులను ఎంపీడీవో కే రమేష్ బుధవారం పరిశీలించారు. ముత్యాలమ్మగుడి వద్ద కాలువ పూడికతీత పనులు పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. కూలీల హాజరు నమోదుపై ఆరా తీశారు. కూలీలకు వడదెబ్బ తగలకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. తాగునీరు, ప్రాథమిక చికిత్స అందుబాటులో ఉంచాలని కార్యదర్శి ఆర్.సత్యనారాయణకు సూచించారు.

సినిమాలు



శ్యామల	: జింఖానా
సూర్యమినీ	: రైడ్–2
సూర్యప్యాలెస్	: హిట్–3
స్వామి	: హిట్–3
శివజ్యోతి	: హిట్–3
అనుశ్రీ	: హిట్–3
రాజా	: హిట్–3
ఊర్వశి	: చౌర్య పాఠం
మేనక	: సూర్యాపేట్ జంక్షన్, సోదరా
రంభ	: గుడ్‌బ్యాడ్‌అగ్లీ, అన్‌టిల్‌డాన్
కుమారి	: సారంగపాణిజాతకం
అప్సర	: రెట్రో
అశోక	: రెట్రో
నామవరం	
వీఎస్ మహల్	: హిట్–3,రెట్రో
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: హిట్–3,రెట్రో
కడియం	
వెంకటసూర్య	: హిట్–3,రెట్రో

నాయక్‌కు స్వాగతం పలికిన కలెక్టర్



నాయక్ మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం సిటీ: తూర్పుగోదావరి జిల్లా పర్యటనకు వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్‌ను బుధవారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం వారు వివిధ సాంఘిక, గిరిజన సంక్షేమ వసతి గృహాలలో చేపడుతున్న వివిధ పనులను పరిశీలించారు. ఇటీవల ప్రకటించిన పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పలువురు విద్యార్థులను నాయక్ ప్రత్యేకంగా ప్రశంసించారు. స్వయం కృషి కోచింగ్ సెంటర్‌ను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. సాంఘిక సంక్షేమ వసతి గృహం, ప్రీ మెట్రిక్ బాలికల వసతి గృహం సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులకి అందజేస్తున్న భోజన వసతి, శిక్షణ కార్యక్రమం తదితర వివరాలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ పర్యటనలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎంఎస్ శోభారాణి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కేఎస్ జ్యోతి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి బి శశాంక తదితరులు ఉన్నారు.

పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి దారుణం

రాజమహేంద్రవరం సిటీ: జమ్మూ కాశ్మీర్‌లో పహల్గాంలో పర్యటకులపై ఉగ్రవాదుల దాడి మేయమైన చర్యని, యావత్ ప్రపంచం ఖండించాలని రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షులు శోభనాద్రి శాస్త్రి పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్లో ఉగ్రదాడికి నిరసనగా అమరులైన వారి ఆత్మ శాంతి కోసం బుధవారం రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో న్యాయవాదుల కొవ్వొత్తు ర్యాలీ నిర్వహించారు. బార్ అసోసియేషన్ నుంచి పుష్కర ఘాట్ వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పెళ్లూరి రమేష్, ట్రెజరర్ కర్రా హనుమంతరావు, జాయింట్ సెక్రటరీ మల్కా శ్రీనివాస్, సీనియర్ సభ్యులు మల్లపరాజు, సభ్యులు సాయి ప్రశాంత్, శ్రీధర్, న్యాయవాదులు అంబటి మురళీకృష్ణ, నామన సీతారాం, ఆదిలక్ష్మి, ధర్నాలకోట వెంకటేశ్వరావు, అనంతరావు, ఠాగూర్, భాస్కర్, నరాల రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నివారణపై అవగాహన



లైంగిక వేధింపులు నివారణపై నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రాంలో పాల్గొన్న అధికారులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): బాలికలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై స్థానిక ఆనం కళాకేంద్రంలో జిల్లా విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఎన్జీవోలకు ఓరియంటేషన్ కార్యక్రమం స్థానిక ఆనం కళా కేంద్రంలో బుధవారం నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన సైకాలజిస్ట్ దుర్గాప్రసాద్ హాజరై పిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులు వాటిని ఏ విధంగా అరికట్టాలి, తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ హరిచంద్ర మాట్లాడుతూ పిల్లలపై లైంగిక దాడులు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు మన అందరిపైన ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ పి.కోమల, జిల్లా విద్యాశాఖ అధికారి కే వాసుదేవరావు చిన్న పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ ఇంద్రజ, డైస్ మేనేజర్ సతీష్, డైస్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

నా బిడ్డ భవిష్యత్తుకు భరోసా ఇవ్వండి

నిరవధిక సమ్మెలో గర్భిణి సీహెచ్‌వో వినూత్న నిరసన



జిల్లా కలెక్టరేట్ వద్ద నిరవధిక సమ్మెలో ప్లకార్డుతో గర్భిణీ సీహెచ్‌వో వినీత



సమ్మెలో ప్లకార్డులతో చిన్నారులు

రాజమహేంద్రవరం రూరల్: 'నన్ను గుర్తించండి.. నాబిడ్డ భవిష్యత్తుకు భరోసా ఇవ్వండి' అంటూ కడియం మండలం దుళ్ల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సీహెచ్‌వో గర్భిణీ వినీత ప్లేకార్డుతో వినూత్న నిరసన చేపట్టడం అందరిని ఆలోచింపజేస్తుంది. అలాగే సీహెచ్‌వోల పిల్లల సైతం సమ్మెలో పాల్గొని 'అమ్మ ఉద్యోగం అటు..ఇటు.. మా భవిష్యత్తు ఎటూ' ప్లకార్డులను ప్రదర్శించారు. బొమ్మూరులోని జిల్లా కలెక్టరేట్ వద్ద ఏపిమిడ్‌లెవెల్ హెల్త్‌ప్రొవైడర్స్(ఎంఎల్‌హెచ్‌పీ)/కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీఏ) ఆధ్వర్యంలో సీహెచ్‌వోల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నిరవధికసమ్మె బుధవారం మూడోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మమత మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనలు ప్రకారం ఆరేళ్లు దాటిన సీహెచ్‌ఓలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్‌మిషన్(ఎన్‌హెచ్‌ఎం) కింద సీహెచ్‌వోలుగా పనిచేస్తున్నామన్నారు. గత రెండు సంవత్సరాలుగా జీతభత్యాలు విషయంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నామన్నారు. ఎన్‌హెచ్‌ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఇంక్రిమెంటు ఇవ్వాలన్నారు. ప్రతి నెల జీతంతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలన్నారు. ప్రతి ఏడాది ఐదుశాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను తీర్చేలా హామీ ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్లను నెరవేర్చే వరకు శాంతియుతమైన నిరసనలు కొనసాగిస్తామని మమత స్పష్టంచేశారు. న్యాయమైన డిమాండ్లును పరిష్కరించాలని సీహెచ్‌వోలు నినాదాలు చేశారు.

దేవీ అమూల్య మృతి తీరని లోటు



సంతాపం వ్యక్తం చేసిన చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: చిన్న వయసులోనే డాక్టర్ దేవి అమూల్య మృతి చెందడం కుటుంబానికి తీరని లోటని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ సంతాపం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీకి చెందిన మాజీ కార్పొరేటర్ పిల్లి నిర్మల కుమార్తె డాక్టర్ దేవీ అమూల్య ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా బుధవారం నగరంలో ఆమె నివాసానికి వెళ్లి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈయన వెంట మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

చిన్నికి జిల్లా అధ్యక్షుడు వేణు పరామర్శ

కడియం: వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ బట్టు స్వప్నదేవి భర్త బట్టు చిన్నిని బుధవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు బుధవారం పరామర్శించారు. ఇటీవల ఒక వివాదం నేపథ్యంలో గాయాలపాలైన చిన్నిని మండల కేంద్రమైన కడియంలోని అతని స్వగృహంలో పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), మండల పార్టీ అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

మోటారుసైకిల్ ఢీకొని వృద్ధుడి మృతి



మృతి చెందిన వృద్ధుడు

రాజమహేంద్రవరం రూరల్: మోటారుసైకిల్ ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు(60) మృతి చెందాడని దివాన్‌చెరువు వీఆర్వో దారా రామజోగి బుధవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం సాయంత్రం 60 ఏళ్ల వృద్ధుడు దివాన్‌చెరువు పండ్లమార్కెట్ దాటుతున్నాడు. ఆ సమయంలో రాజమండ్రి వైపు నుంచి రాజానగరం వైపు వెళుతున్న మోటారుసైకిల్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధుడు తలకు బలమైన గాయాలయ్యాయి. ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి నుంచి వెళ్లిన తన చెల్లి ఇప్పటివరకు తిరిగిరాలేదని హుకుంపేట డీ బ్లాకు గౌతమినగర్‌కు చెందిన ఏపూరి విజయకుమారి బుధవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. హుకుంపేట డీ బ్లాకు గౌతమినగర్‌కు చెందిన 19 ఏళ్ల యువతి నర్సింగ్ కోర్సు చదువుతోంది. బుధవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అప్పటి నుంచి తిరిగిరాలేదని, బంధువులు, పరిసర ప్రాంతాలలో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదని ఆమె సోదరి విజయకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వాసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో ఖాళీగానున్న వైద్య సిబ్బంది పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించుచున్నారు. ఆ మేరకు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్న ఈ పోస్టులకు ఈనెల ఒకటి నుంచి 12వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తులను ప్రభుత్వ వైద్య కళాశాలలో అందజేయాలి. దరఖాస్తుల వివరాలు ఈస్ట్ గోదావరి.ఏపీ.గవ్.ఇన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చన్నారు.

ఖాళీల వివరాలు

కంప్యూటర్ ప్రోగ్రామర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ట్రైనర్, ఎలక్ట్రికల్ హెల్పర్, మార్చురీ అటెండర్, ఆఫీస్ సబార్డినేట్, అనస్తీషియా టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 2, నెట్వర్ అడ్మినిస్ట్రేటర్, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, స్పీచ్‌థెరపిస్ట్, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్, జనరల్ డ్యూటీ అటెండర్, స్టోర్ అటెండర్, సైక్రియాట్రిక్ సోషల్ వర్కర్, చైల్డ్ సైకాలజిస్ట్, క్లినికల్ సైకాలజిస్ట్, ల్యాట్ అటెండెంట్

అక్షరాలే అగ్నికణాలుగా మలచి..



మాట్లాడుతున్న ఆంగ్ల అధ్యాపకురాలు స్వర్ణ శ్రీ



కడియం శాఖా గ్రంథాలయంలో శ్రీశ్రీ జయంతి

రాజమహేంద్రవరం సిటీ: అక్షరాలే అగ్నికణాలుగా మలచి, సలసల కాగే కవిత్వాన్ని, ఆధునిక సాహిత్యానికి పరిచయం చేసిన మహాకవి శ్రీశ్రీ అని ఆంగ్ల అధ్యాపకురాలు డాక్టర్ వై.స్వర్ణ శ్రీ అన్నారు. బుధవారం ఎస్కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ, కళా గౌతమి సంయుక్త నిర్వహణలో శ్రీ శ్రీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శతాబ్దం మరువని ఆధునికుడిగా ఎలుగెత్తి చాట దగిన కవి, శ్రీశ్రీ అని అన్నారు. తన పదునైన భావజాలంతో కార్మికులు, కర్షకులు, శ్రామికుల, శ్రమను గుర్తిస్తూ కవిత్వాన్ని రాసి అభ్యుదయ కవిగా కొనసాగారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రమణమూర్తి మాట్లాడుతూ శ్రీశ్రీ కవిత్వమే ఊపిరిగా బతికారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షుడు, డాక్టర్ పీవీబీ సంజీవరావు, అధ్యాపకులు జి.శరత్‌బాబు, కే శాంతి, జి.రాంబాబు విద్యార్థి పూర్వసంఘ అధ్యక్షుడు చీర్ల సీతారామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోరుకున్న శ్రీశ్రీ

కడియం: సమాజంలో అట్టడుగు వర్గాల వారి అభ్యున్నతిని తన సాహిత్యం రూపంలో శ్రీశ్రీ కోరుకున్నారని చేళ్లపిళ్ల వేంకట శాస్త్ర కళాసేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడపా సుబ్రహ్మణ్యం, చిలుకూరి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శ్రీశ్రీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కడియం నీటి సంఘం అధ్యక్షులు చిక్కాల ఈశ్వరరావు, రైతు నాయకులు బోణం సత్యనారాయణ, కళ్యాణం సూరిబాబు, లంకేశ్వరరావు, భాస్కరరావు, తాతబ్బాయి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మగ్గం వర్క్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న వెంకటేశ్వరరావు

రంగంపేట: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా కృషి చేయాలని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు కోరారు. వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోటపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన మగ్గం వర్క్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న 60 మంది మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న వారందరూ వర్క్‌ను కొనసాగిస్తూ ఆర్థికంగా లాభపడాలన్నారు. ఈ రోజుల్లో బోటిక్‌కు మంచి డిమాండ్ ఉందని దాని ద్వారా ఆదాయం లభిస్తుందన్నారు. ఆసక్తి ఉన్న మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు తమ ఫౌండేషన్ అందుబాటులో ఉంటుందని ఏ గ్రామంలోనైనా శిక్షణ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ సుంకర నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మారుతున్న ఆహార అలవాట్లే క్యాన్సర్‌కు కారణం

న్యాయవాదులకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు



డాక్టర్‌ను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: మారుతున్న ఆహారపు అలవాట్లు, కాలుష్యం, కల్తీలు, మానసిక ఒత్తిడి వంటివి క్యాన్సర్ పెరగడానికి కారణం అవుతున్నాయని చంద్రకళ సూపర్ స్పెషాలిటీ డాక్టర్ పట్నాల విశ్వనాథ్ పేర్కొన్నారు. బుధవారం రాజమహేంద్రవరం బార్ అసోషియేషన్‌లో లైన్స్ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో న్యాయవాదులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రథమ దశలో గుర్తిస్తే చాలామంది ప్రాణాలు కాపాడ వచ్చునన్నారు. ధూమపానం, ఆల్కహాలు వంటివి చాలా రకాల క్యాన్సర్‌కి కారణాలవుతున్నాయన్నారు. సరివ్రకల్ క్యాన్సర్ నివారించడానికి హెచ్పీవీ వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చిందని, దీనిని చిన్న వయసులో 9 సంవత్సరాల లోపు ఇవ్వడం వలన వంద శాతం కచ్చితంగా ఫలితాలు ఉంటాయన్నారు. సెల్ఫోన్ రేడియేషన్ కూడా బ్రెయిన్ క్యాన్సర్‌కి కారణమవుతుందని రిపోర్టులు తెలియజేస్తున్నాయన్నారు. దీనిపై మరింత లోతుగా అధ్యయనం జరగాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లైయన్స్ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం అధ్యక్షుడు మద్దుల వీఎస్ శ్రీరామ గుప్త, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శోభనాద్రి శాస్త్రి క్లబ్ కార్యదర్శి వెన్న కుమారస్వామి, ట్రెజర్ రాఘవరావు, అడ్మిన్ గ్రంధి వసంత కుమారి, బార్ కార్యదర్శి బి.రమేష్ , బార్ ట్రెజర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

పలు చోరీ కేసుల్లో నిందితుడు



నిందితుడు, మోటార్ సైకిళ్లను చూపుతున్న పోలీసులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలో వరుస మోటారు సైకిళ్ల దొంగతనాలతో పాటు, దేవుని గుడిలో హుండీ, ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన కేసుల్లో నిందితుడిని టూ టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు సౌత్ జోన్ డీఎస్పీ ఎస్.భవ్య ఆధ్వర్యంలో పోలీసులు మోటారు సైకిళ్ల దొంగతనాలపై నిఘా పెట్టా రు. మోటారు సైకిళ్లు దొంగిలిస్తున్న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సమీపంలోని డేగాపురానికి చెందిన జువ్వల కుమార్‌రాజును స్థానిక ఐదుబళ్ల మార్కెట్ సమీపంలోని రైల్వే క్వార్టర్స్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారణ చేసి, ఇటీవల దొంగిలించిన మోటారు సైకిళ్ల వివరాలు రాబట్టారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు బైకులు, భీమవరం చిన్న అమిరంలో స్కూటర్, పడమట, వీరవల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒక్కొక్క బైక్, ఉండి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంటి తాళం పగలగొట్టి చోరీ, బొమ్మూరు పోలిస్ స్టేషన్ పరిధిలో గుడిలో హుండీ దొంగతనం, 2023 నవంబర్‌లో జువ్వల కుమార్‌రాజు, బేతా దుర్గాప్రసాద్, మామిడి దుర్గారావుతో కలిసి విశాఖపట్నం, గోపాలపట్నంల్లో ఇళ్ల తాళం పగులగొట్టి చోరీ చేసినట్టు విచారణలో తేలింది. నిందితుడిని అరెస్టు చేసి, మొత్తం ఐదు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అతనిని కోర్టులో హాజరుపర్చి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు సెంట్రల్ జైలుకు తరలించారు. ఆయా కేసుల్లో మారుబోయిన మావుళ్లు అనే వ్యక్తిని ఈ నెల 23న అరెస్టు చేశారు. కేసులను చాకచక్యంగా ఛేదించిన టూ టౌన్ సీఐ శివగణేష్, హెచ్‌సీ రాజశేఖర్, క్రైం పార్టీ కానిస్టేబుల్ ఎస్‌కే రబ్బానీ, కానిస్టేబుళ్లు రాము, పి.రవీంద్ర, పోసయ్య, బీఎస్‌కే నాయక్‌ను ఎస్పీ అభినందించారు.

జూన్‌లో జీజీయూలో వికసిత్ భారత్ జాతీయ సదస్సు



పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో జూన్ 28, 29వ తేదీల్లో 'వికసిత్ భారత్ 2047 కోసం పరిశోధన, ఆవిష్కరణల వినియోగం' అనే అంశంపై జాతీయ సదస్సు జరగనుంది. ఇందుకు సంబంధించిన ప్రత్యేక లోగో, వెబ్ సైట్‌తో కూడిన పోస్టర్‌ని జీజీయూ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) బుధవారం ఆవిష్కరించారు. 2047 నాటికి లక్ష్యం మేరకు భారత దేశం ప్రగతిని సాధించాలంటే దేశంలో ఉన్న జీజీయూ వంటి విద్యా సంస్థలు ప్రభావవంతమైన పరిశోధనలు, ఆవిష్కరణల ద్వారా ముందుండాలన్నారు. అందుకు ఈ సదస్సు ఒక వేదికగా నిలుస్తుందని భావిస్తున్నామన్నారు. పరిశోధన, ఆవిష్కరణల సలహాదారు ప్రొఫెసర్ సిశిర్ సాహు మాట్లాడుతూ ప్రభుత్వ, పరిశ్రమ, విద్యా రంగాల మధ్య సహకారంతో కీలక పరిష్కారాలను కలిసి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు కె.విజయభాస్కర రాజు, కేబీఆర్ వర్మ, పీఎంఎంఎస్ శర్మ, శ్రీనివాసరావు, టీవీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.